నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, గురువారం 21 మార్చి 2024 | VIKARABAD



కడ్తాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయండి

**శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**

**కడ్తాల్ చెక్‌పోస్టును సందర్శించిన డీసీపీ, అడిషనల్ డీసీపీ**

కడ్తాల్, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. కడ్తాల్ కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం సాయంత్రం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. రసీదులు, ఆధారాలు లేకుండా నగదు, బంగారం రవాణా చేయవద్దన్నారు. తనిఖీల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే వాటికి సరైన పత్రాలు చూపించాలని తెలిపారు. కడ్తాల్‌తోపాటు, షాద్‌నగర్, రాయకల్ టోల్‌ప్లాజా, పాల్మాకుల, లాల్‌పహాడ్, చౌదరిగూడెంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు.

అనంతరం స్థానిక పోలీసులతో కలిసి ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్, ఆమనగల్లు ఎస్‌హెచ్‌వోలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐలు వరప్రసాద్, బలరాంనాయక్, శ్రీకాంత్, ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పేదోడి ఫంక్షన్ హాళ్లపై సర్కారు శీతకన్ను!

**మూడు నెలలు దాటినా.. 14 చోట్ల పురోగతి లేని పనులు**

**జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : నిరుపేదలు సైతం గర్వించే స్థాయిలో వేడుకలు నిర్వహించుకునేలా ఆధునిక హంగులతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్స్‌పై కాంగ్రెస్ సర్కారు శీతకన్ను వేసింది. ఒకేసారి రెండు వేల మందితో వేడుక నిర్వహించేలా.. సకల సౌకర్యాలతో గత కేసీఆర్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా రూ. 90 కోట్లతో 31 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మించాలని భావించింది. గతేడాది డిసెంబర్ నాటికి రూ. 30.10కోట్లతో 12 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్మాణ దశలో 14 చోట్ల పనులు ఉండగా..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా.. ఆ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించకపోవడం..కమిషనర్ రొనాల్డ్ రాస్ సైతం అదే రీతిలో పురోగతిలో ఉన్న పనులను పట్టించుకోలేదు. ఫలితంగా ఇంజినీర్లు సైతం పురోగతిలో ఉన్న పనులను ముందుకు తీసుకువెళ్లలేక చాలా చోట్ల పనులు చేయలేక చేతులెత్తేశారు. కాంట్రాక్టర్లకు నిధుల లేమి సమస్య ఒకవైపు..మరోవైపు ఇంజినీర్ల అలసత్వం మరోవైపు.. వెరసి.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని బహుళ వినియోగ ఫంక్షన్‌హాళ్లను సకాలంలో అందుబాటులోకి తీసుకువచ్చి వందలాది మందికి ప్రయోజనం చేకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.



# 'హోం' ఓటింగ్..

పోలింగ్ కేంద్రాలకు రాలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారు. ఇది పోలింగ్ శాతంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏండ్ల వారికి అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల్లోనూ వయో పరిమితిని 85 ఏండ్లకు పెంచింది. 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు సైతం ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే హోం ఓటింగ్‌కు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి. బీఎల్వోల ద్వారా ఈ ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే మొదలవ్వగా.. ఏప్రిల్ 22 నాటికి దరఖాస్తులు అందజేసిన వారికే అధికారులు ఓటు హక్కును కల్పించనున్నారు.

**85 ఏండ్లు దాటిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు అవకాశం**

- మొబైల్ ఓటింగ్ వాహనంతో అవకాశం కల్పిస్తున్న ఎన్నికల సంఘం
- జిల్లాలో బీఎల్వోల ద్వారా మొదలైన ప్రక్రియ
- ఏప్రిల్ 22 నాటికి దరఖాస్తు చేసుకున్నవారికే ఓటు వేసేందుకు అవకాశం
- జిల్లాలో 85 ఏండ్లు పైబడిన వృద్ధులు 19,350 మంది, దివ్యాంగులు 45,567

**జిల్లాలో 85 ఏండ్లకు పైబడిన ఓటర్లు..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 617 | 981 | 0 | 1,598 |
| ఎల్బీనగర్ | 1,827 | 1,894 | 01 | 3,722 |
| మహేశ్వరం | 1,615 | 1,932 | 0 | 3,547 |
| రాజేంద్రనగర్ | 1,079 | 1,248 | 0 | 2,327 |
| శేరిలింగంపల్లి | 1,931 | 1,773 | 01 | 3,705 |
| చేవెళ్ల | 709 | 1,174 | 0 | 1,883 |
| కల్వకుర్తి | 518 | 909 | 0 | 1,437 |
| షాద్‌నగర్ | 433 | 698 | 0 | 1,131 |
| మొత్తం | 8,729 | 10,619 | 02 | 19,350 |

**జిల్లాలో దివ్యాంగుల వివరాలు..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 3,932 | 3,492 | 01 | 7,425 |
| ఎల్బీనగర్ | 3,772 | 2,970 | 01 | 6,743 |
| మహేశ్వరం | 4,486 | 3,892 | 01 | 8,379 |
| రాజేంద్రనగర్ | 2,358 | 1,807 | 0 | 4,165 |
| శేరిలింగంపల్లి | 3,228 | 2,462 | 02 | 5,692 |
| చేవెళ్ల | 2,404 | 1,638 | 0 | 4,042 |
| కల్వకుర్తి | 1,968 | 1,693 | 0 | 3,661 |
| షాద్‌నగర్ | 2,713 | 2,747 | 0 | 5,460 |
| మొత్తం | 24,861 | 20,701 | 05 | 45,567 |

రంగారెడ్డి, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పోలింగ్ నమోదు కావడం లేదు. ఇందుకు చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటింగ్‌కు దూరంగా ఉండడం ఓ కారణం. వీరికి పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు వీల్ చైర్‌తోపాటు ఇతర సదుపాయాలను కల్పిస్తున్నప్పటికీ వృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకురావడం పెద్ద సమస్యగా మారుతున్నది. వీరిని మోసుకుంటూ కేంద్రాలకు తీసుకురాలేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో చాలామంది ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. ఈ మేరకు అధికారులు ఓటరు జాబితాను అనుసరించి జిల్లాలో 85 ఏండ్లకు పైబడిన వారిని, దివ్యాంగులను గుర్తించారు. అధికారులు గుర్తించిన ప్రకారం.. జిల్లాలో 85–150 ఏండ్ల మధ్య వయస్కులు మొత్తం 19,350 మంది ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 8,729 మంది ఉండగా.. స్త్రీలు 10,619 మంది, థర్డ్ జెండర్స్ ఇద్దరు ఉన్నారు. అలాగే.. 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులు జిల్లావ్యాప్తంగా 45,567 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పురుషులు 24,861మంది, స్త్రీలు 20,701మంది, థర్డ్ జెండర్స్ ఐదుగురు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఈసీ కల్పించిన ఈ అవకాశంతో వృద్ధులు, దివ్యాంగులకు ఉపశమనం కలుగుతున్నది.

**దరఖాస్తుకు ఏప్రిల్ 22 గడువు..**

వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ప్రక్రియ జిల్లాలో మొదలైంది. ఈసీ మార్గదర్శకాల ప్రకారం బీఎల్వోలు వారిచేత దరఖాస్తు చేయిస్తున్నారు. ఫారం–12డీ ఫారాలను అర్హులైన వారికి అందజేస్తున్నారు. పూర్తించిన దరఖాస్తులను ఏప్రిల్ 22 నాటికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌వో)కి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికే ఇంటి నుంచి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించనున్నారు. ఏ రోజు ఓటు వేయాలో ముందుగానే నిర్ణయించిన తేదీన వృద్ధులు, దివ్యాంగుల ఇండ్ల వద్దకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను చేపడుతారు. బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేసి ఆ ఓటును సీల్ చేసిన తర్వాత స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పంపిస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి హోం ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

# కేసీఆర్‌ను ఎదుర్కొనలేకే.. అక్రమ కేసులు

- మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థల ద్వారా ప్రజాస్వామ్యాన్ని తప్పదోవ పట్టిస్తున్నది
- చేవెళ్లలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం
- మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి
- శంషాబాద్‌లో పార్లమెంటు ఎన్నికలపై ముఖ్యనేతలతో సమావేశం

రంగారెడ్డి, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనలేక మోదీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థల ద్వారా ప్రజాస్వామ్యాన్ని తప్పుదోవ పట్టిస్తూ అక్రమ కేసులను బనాయిస్తున్నదని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలపై ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై ప్రగాఢ నమ్మకం ఉన్నదని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పదేండ్లు పాలించిన బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదన్నారు. నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని మాయ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ఆ లెక్కన 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. కొత్త ఉద్యోగాల ఊసేలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను సైతం తీసేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గొంతులో ప్రాణమున్నంత వరకు మోటర్లకు మీటర్లు పెట్టనివ్వనని కేసీఆర్ అన్నందుకు, నల్ల చట్టాలను వ్యతిరేకించినందుకు కక్ష పెంచుకుని కేంద్రం రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మూడు నెలల్లోనే ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయి విమర్శలను ఎదుర్కొంటున్నదని విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలుపించుకుని బీఆర్‌ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఒక్క తాటిపైకి వచ్చి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, దయానంద్ గుప్తా, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో.. 2 జిల్లా నంబర్

- రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలు
- రికార్డు స్థాయిలో కూలీలు హాజరు
- ప్రస్తుతం ఉపాధి హామీ పనులకు రోజుకు 45,434 మంది కూలీలు హాజరు
- గత నెలతో పోలిస్తే 24 వేలకుపైగా పెరిగిన కూలీలు
- వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఉపాధి పనులవైపు కూలీలు
- గత నెలలో రోజుకు 21 వేల మంది కూలీలు హాజరు
- ఈ నెలాఖరులోగా 50 వేలు దాటుతుందని అధికారుల అంచనా
- ఇప్పటివరకు 56.48 లక్షల పనిదినాలు కల్పన
- ఇప్పటివరకు కూలీలకు రూ.105 కోట్ల చెల్లింపులు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులు.. 3,77,087 మంది కూలీలు

వికారాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. గురువారం వికారాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పనులకుగాను అత్యధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యారు. వికారాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలువగా, ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది అత్యధిక కూలీలు హాజరైనట్లు రికార్డు నమోదైంది. జిల్లావ్యాప్తంగా గత నెల మొదటి వారం వరకు రోజుకు 21 వేల మంది కూలీలు పనులకురాగా, ఈనెల మొదటి వారం నుంచి ఆ సంఖ్య పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 45 వేలకుపైగా కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. ఈ నెలాఖరులోగా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య 50 వేలు దాటుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మట్టి రోడ్లు, నీట ఊట గుంతల నిర్మాణాలు, నర్సరీల్లో మొక్కలు పెంచడం తదితర పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం 59.31 లక్షల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 56.48 లక్షల పని దినాలను జిల్లా యంత్రాంగం కల్పించింది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.194 కూలీ డబ్బులను అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులు ఉండగా 3,77,087 మంది కూలీలు ఉన్నారు.



**45,434 మందికి పెరిగిన కూలీలు...**

జిల్లాలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రికార్డుస్థాయిలో పెరిగింది. గత నెలతో పోలిస్తే ఈ నెలలో 24 వేలకుపైగా కూలీలు పెరిగారు. జిల్లాలో 566 గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఎక్కువగా జిల్లాలోని కులకచర్ల మండలంతోపాటు బొంరాస్‌పేట, ధారూరు, పెద్దేముల్, యాలాల మండలాల్లో ఉపాధి పనులకు హాజరవుతున్నారు. మంగళవారం జిల్లాలోని ఆయా మండలాల్లో ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 45,434 మంది కూలీలు హాజరుకాగా, కులకచర్ల మండలంలో రోజుకు 3327 మంది, బొంరాస్‌పేట మండలంలో 3577 మంది, ధారూరు మండలంలో 2733 మంది, పెద్దేముల్ మండలంలో 2924 మంది, యాలాల మండలంలో 2711 మంది, నవాబుపేట మండలంలో 2572 మంది, మర్పల్లి మండలంలో 2711 మంది, కోట్‌పల్లి మండలంలో 1516 మంది, పరిగి మండలంలో 2791 మంది, పూడూరు మండలంలో 2370 మంది కూలీలు, మోమిన్‌పేట మండలంలో 2339 మంది, దౌల్తాబాద్ మండలంలో 2578 మంది, బంట్వారం మండలంలో 1400 మంది, బషీరాబాద్ మండలంలో 2761 మంది, కొడంగల్ మండలంలో 2002 మంది, దోమ మండలంలో 2587 మంది, తాండూరు మండలంలో 2420 మంది, వికారాబాద్ మండలంలో 1638 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకుగాను ఇప్పటి వరకు రూ.105 కోట్ల చెల్లింపులను పూర్తి చేశారు. ఇంకుడు గుంతలు, నీటిఊట గుంతల నిర్మాణాలు, మట్టి రోడ్ల నిర్మాణ పనులను ప్రధానంగా చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లోని రాళ్లను తీసివేయడం, భూమిని చదునుచేయడం, బౌండ్రీలు ఏర్పాటు చేయడం, ఎరువు గుంతల నిర్మాణం, బోరుబావి తవ్వించడం తదితర పనులు చేపట్టనున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మట్టి కట్టలు, పశువులకు షెడ్ల ఏర్పాటు, పంట కాలువల మరమ్మతులు, పంట మార్పిడి కల్లాలు, కొత్త సేద్యపు బావులు తవ్వడం, నిరవధిక సమతల కందకాలు, ఖండిత సమతల కందకాలు, పశువుల నిరోధక కందకాలు, భూసార సంరక్ష కందకాలు తదితర నిర్మాణ పనులను చేస్తున్నారు.

**4849 కుటుంబాలకే వంద రోజుల కల్పన..**

జిల్లావ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 4849 కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు. రెండేండ్ల క్రితం వరకు జిల్లాలో ఏటా 20 వేలకుపైగా కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత రెండేండ్లుగా కూలీల సంఖ్య ఐదు వేలకూ పెరుగకపోవడం గమనార్హం. కొడంగల్ మండలంలో 796 కుటుంబాలు, నవాబుపేట మండలంలో 532, దోమ మండలంలో 479, బంట్వారం మండలంలో 441, వికారాబాద్ మండలంలో 393 కుటుంబాలు, బొంరాస్‌పేట మండలంలో 294, కులకచర్ల మండలంలో 110, యాలాల మండలంలో 182, తాండూరు మండలంలో 51 కుటుంబాలు, బషీరాబాద్ మండలంలో 109, దౌల్తాబాద్ మండలంలో 126 కుటుంబాలకు, పరిగి మండలంలో 75, ధారూరు మండలంలో 206, కోట్‌పల్లి మండలంలో 58, మర్పల్లి మండలంలో 289 కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు.



